రహదారి విస్తరణ పనులు మిథ్యేనా?

- మూడు దశాబ్దాలుగా ట్రాఫిక్‌కు ఇబ్బంది
- పట్టించుకోని ఎన్‌హెచ్ శాఖాధికారులు
- సర్వేలపై సర్వేలు జరిగినా, మార్కులు వేసినా పనులు శూన్యం

ఆకివీడు: పీపీ రోడ్డుకు మోక్షం కలిగి, జాతీయ రహదారిగా హోదా పొందినప్పటికీ, ప్రజలకు మాత్రం వీధి రోడ్డుగానే ఉండిపోయింది. పీపీ రోడ్డును మూడు దశాబ్దాల క్రితం రహదారుల శాఖ జాతీయ రహదారిగా గుర్తించి, విలీనం చేసింది. పీపీ రోడ్డుగా ఉన్నప్పుడే రహదారి విస్తరణ పనులను స్థానిక గుమ్ములూరు రోడ్డు నుంచి ప్రారంభించారు. సుమారు అర కిలోమీటరు విస్తరణ పనులు చేపట్టిన తరువాత స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. తరువాత మరో ఐదేళ్లకు విస్తరణ పనులను ఉప్పుటేరు నుంచి చేపట్టి, స్థానిక మాదివాడ సెంటర్ వరకూ సర్వే చేసి పనులు నిలుపుదల చేశారు. దీంతో జాతీయ రహదారి అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండిపోయాయి. సుమారు 50 మీటర్ల విస్తీర్ణంలో ఉండాల్సిన రహదారి పలుచోట్ల కేవలం 25 మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఉప్పుటేరు నుంచి ఆకివీడు మండలం అజ్జమూరు గరువు వరకూ రహదారి కుచించుకుపోతుంది. సర్వే చేసిన మార్కులను కూడా ఆక్రమణదారులు చెరిపివేశారు. దీంతో దుకాణాలు రోడ్డు వైపుకు వస్తూ వాహన రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తున్నాయి. పలుసార్లు రోడ్ మార్జిన్ కోసం రెండు మూడు అడుగులు ఖాళీ చేసినప్పటికీ రోడ్డు విస్తరణ మాత్రం జరగలేదు.



రహదారి ఆక్రమణకు గురికావడంతో రద్దీగా ఉన్న దృశ్యం

నిరంతరం ట్రాఫిక్

జాతీయ రహదారి ఆకివీడు ప్రధాన సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. రెండు వాహనాలు ఎదురెదురైతే ట్రాఫిక్ ఆగిపోతుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ మరింతగా నిలిచిపోయి, ద్విచక్ర వాహనదారులకు, పాదాచారులు కూడా నడవలేని దుస్థితిలో రహదారి ఉంది. ప్రతి నిత్యం స్థానికులు పేరు గొప్ప ఊరి దిబ్బ అన్న చందంగా జాతీయ రహదారి ఉందని తిట్టుకుంటున్నారు. నలుగురు ఎంపీలు మారినా, కేంద్ర మంత్రి పదవి ఈ ప్రాంతానికి దక్కినా తమకు మాత్రం రహదారి మోక్షం కల్గడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదేళ్లయినా మరమ్మతులకు నోచుకోని వైనం

కేంద్రంలో ఎన్డీఏ కూటమితో నరేంద్ర మోడీ ప్రభుత్వం మొట్ట మొదటి సారిగా ఏర్పడిన తరువాత మూడేళ్లకు ఈ రహదారి విస్తరణ, అభివృద్ధికి స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వర్చువల్ శంఖుస్థాపనలను అప్పటి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారి భూమి పూజ చేశారు. కనీసం రోడ్డు మరమ్మతులు కూడా నేటికీ చేపట్టకపోవడం దారుణమని స్థానికులు వాపోతున్నారు. రహదారి విస్తరణ పనులను చేపట్టి వాహనాల రాకపోకలకు, స్థానికులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను పలువురు కోరుతున్నారు.


ఎస్ టర్నింగ్ వద్ద ఇరుకుగా ఉన్న రహదారి

క్లుప్తంగా

జెడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడి మృతి


భీమవరపు అజ్మల్ సాహెబ్ (78)

ఆకివీడు: స్థానిక ముస్లిం పెద్ద, జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు భీమవరపు అజ్మల్ సాహెబ్ (78) సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె కుమారుడు ప్రముఖ వైద్యులు ఎండీ బిలాల్‌ను దత్తత తీసుకున్నారు. ఆయన మృతి పట్ల స్థానిక ముస్లింలు పెద్ద ఎత్తున సంతాపం తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. సంతాపం తెలిపిన వారిలో కనుమూరు అబ్బాయిరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, ఎండీ జక్కీ, మోటుపల్లి కుమారి, ఎండీ ఆలీ, నాయకులు కేశిరెడ్డి మురళీ, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధరరావు, మోటుపల్లి ప్రసాద్, వానపల్లి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సరళ

భీమవరం: విద్యార్థులు బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరళ అన్నారు. సోమవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి గరల్స్ హైస్కూల్లో 9, 10 తరగతులు విద్యార్థులకు బాలికలకు ఐసీడీఎస్ సేవలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాలలకు సంబంధించిన చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు బాలల న్యాయచట్టం, పోక్సో, బాల్యవివాహాల నిషేధ చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమరంలో డీఈపీయూ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, స్టాప్‌సెంటర్ లీగల్ ఆఫీసర్ పి దుర్గ, ఎస్ సూర్యప్రభ, కె స్వర్ణలత, ఎం వెంకటేశ్వరమ్మ, జి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమన్వయం పాటించాలి


భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంగారామ్, కల్పన

భీమవరం: కాకినాడ జిల్లా శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధలో ఘర్షణ పడడం మంచి పద్ధతి కాదని ఆలిండియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరమామిడి గంగారామ్ అన్నారు. సోమవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలో మంత్రి హోదాలోని వ్యక్తి సమన్వయం పాటించకపోవడం దారుణమన్నారు. పదవులు పొందిన నాయకులు రాజకీయాలకు అతీతంగా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. కాకినాడలో చోటు చేసుకున్న సంఘటన బాధకరమన్నారు.

అవగాహన సదస్సు

పాలకొల్లు సెంట్రల్: మన నిత్య జీవితంలో న్యూటన్ గమన నియమాలు అనేవి ఒక భాగంగా ఉంటాయని హెచ్ఓడీ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ ఏపీవీ అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక చాంబర్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఫిజిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో భౌతికశాస్త్రం అనేది చాలా ప్రాముఖ్యమైన శాస్త్రమన్నారు. ఇందులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్రంలో వచ్చే నూతన మార్పులను గమనిస్తూ వాటికి అనుగుణంగా విద్యను అభ్యసించాలని తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, ఫిజిక్స్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, బి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన క్షీరారామలింగేశ్వర స్వామిని కార్తీక సోమవారం పురస్కరించుకుని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే అంతరాలయంగా ఉన్న జనార్ధన స్వామి, పార్వతీ, లక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకస్వాములు గోత్రనామాలతో పూజలు చేసి ప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, బాకూరి సత్య నిరంజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. ఆక్రమణలో నిర్మించిన ర్యాంపు తొలగింపు, సరిహద్దు ఇంటిలో కొబ్బరి మొక్క వేర్లు తన ఇంట్లోకి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తుందని, జానకమ్మ ఆసుపత్రి పరిసరాల్లో ఆక్రమణలు తొలగించాలని, ఇసుక లేక పని పూర్తిగా నిలిచిపోయిందని, బుక్ చేసినా ఇంత వరకూ రాలేదని, 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించి పనులు చేసినా కుప్పనపూడి, కోళ్లపర్రు, చినమిల్లిపాడు, అజ్జమూరు, పంచాయతీ బిల్లులు చెల్లించలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా ఫిర్యాదులను పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు పంపినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సినిమా థియేటర్ వద్ద గొడవ.. కేసు నమోదు

భీమవరం: సినిమా థియేటర్ వద్ద ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన గొవడలో పట్టణంలోని యిర్రింకులవారి వీధికి చెందిన టి రాజ్‌కుమార్ మరికొంతమంది గాయపడగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని భీమవరం టుటౌన్ ఎస్ఐ ఎం. ఇశ్రాయిల్ సోమవారం చెప్పారు. ఆదివారం రాత్రి పట్టణంలోని చినఅప్పారావుతోటకు చెందిన కర్రి శ్రీహరి పద్మాలయ థియేటర్‌లో సినిమా చూడడానికి వెళ్లాడు. థియేటర్‌లోని షాపులో తినుబండారులు కొనుగోలు చేస్తుండగా రాజ్‌కుమార్‌కు శ్రీహరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ తరుణంలో శ్రీహరి పక్కనే వేడి నూనెతో ఉన్న మూకుడును తన్నడంతో రాజ్‌కుమార్‌తో పాటు మరి కొంతమంది గాయపడ్డారు. బాధితులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇశ్రాయిల్ చెప్పారు.

'మానవత' ఆర్థిక సాయం

భీమవరం: పేదరికంతో కళాశాల ఫీజు చెల్లించడానికి ఇబ్బందిపడుతున్న విద్యార్థినికి మానవత సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన ధమరసింగ్ భవ్యశ్రీ పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతోంది. అయితే కళాశాల ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఆర్థికంగ ఇబ్బంది పడుతున్న విషయం మానవత సంస్థ దృష్టికి రావడంతో సంస్థ తరపున సోమవారం రూ.ఐదు వేలు అందించినట్లు సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు చెప్పారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నర్సింహారావు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లలకోడేరులో దీపోత్సవం

పాలకోడేరు: కార్తీక మాసం సందర్భంగా గొల్లలకోడేరులోని సంజన ఎస్టేట్‌లో సోమవారం రాత్రి అల్లూరి సీతారామరాజు అపార్ట్‌మెంట్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, దీపోత్సవం కమిటీ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించారు. కలిదిండి వెంకటేశ్వరరాజు, రాధా దంపతులచే చంద్రమౌళిశ్వర స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణకు హాజరైన విద్యార్థినిలు

భీమవరం: మహిళలు ఆత్మ రక్షణలోనూ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంలో తమను తాము తీర్చిదిద్దుకునేలా శిక్షణ పొందాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు అన్నారు. సోమవారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థినిలు కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలన్నారు. ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సెల్ఫ్ డిఫెన్స్ పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి భువనేశ్వరి, కరాటే ట్రైనర్ బి రమేష్, ఎస్‌వీ వెంకట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు, హాస్టల్ వార్డెన్ కె . కిషోర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లం'ఘనులు'

ఎక్కడి ఫ్లెక్సీలు అక్కడే

భీమవరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నిక ఏదైనా నిబంధనలు ఒక్కటే. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ప్రక్రియ పూర్తి అయ్యేవరకు కోడ్ అమలులో ఉంటుంది. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. విచిత్రం ఏమిటంటే నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులుండే ప్రభుత్వ కార్యాలయ వద్దనే పెద్ద ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నా వాటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వచ్చే నెల 5వ తేదిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరగనుంది. ఈనెల 11వ తేదిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. వెంటనే ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయని ప్రభుత్వ అధికారికి కార్యక్రమాలు ఏమీ చేపట్ట వద్దని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరంగా అభివృద్ధి కార్యక్రమాలు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిలిపివేశారు.

● తొలగని ఫ్లెక్సీలు....

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అప్పటి వరకు ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్స్ తొలగించడం, వారి శిలా విగ్రహాలకు ముసుగులు వేయడం పరిపాటి. అయితే అటువంటి నిబంధనలు ప్రస్తుత ఎన్నికల్లో అమలు కావడం లేదు. ఇటీవల కూటమి పార్టీల నాయకులకు ఇటీవల పదవులు రావడంతో గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లోను సైతం పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్స్ ఏర్పాటుచేశారు. అలాగే అంతకు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. కూటమిలోని తెదేపా, జనసేన, బీజేపీ నాయకులకు స్వాగతాలు, అభినందనలు తెలుపడమేగాక ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి.


భీమవరంలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉన్న కేంద్రమంత్రి ఫ్లెక్సీ


భీమవరంలోని మావుళ్లమ్మ గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీ

రంగా విగ్రహానికి ముసుగు– కేంద్రమంత్రి ఫ్లెక్సీ ప్రదర్శన..

భీమవరం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉన్న ప్రజానాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు, ఆ పక్కనే ఉన్న కేంద్రమంత్రి ఫ్లెక్సీని పట్టించుకోకపోవడం విశేషం. అలాగే పట్టణంలోనే గాకుండా జిల్లాలోని అనేక గ్రామాల్లో సైతం ప్రజాప్రతినిధులు, నాయకులు ఫ్లెక్సీలు దర్శనమిస్తున్న అధికారులు పట్టించుకోవడంతో అసలు ఎన్నికల కోడ్ అమలులో ఉందా? లేదా? అనే సందేహం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించిన ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

ఉండి: సహకార సంఘాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగటానికి సిబ్బంది కృషి చేయాలని జిల్లా సహకార అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉండి మండలం యండగండి సహకార సంఘం వద్ద సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పర్సన్ ఇన్‌చార్జి పి.రామదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి జి.సత్యనార్యాయణ, తదితరులు పతాకావిష్కరణ చేశారు. అనంతరం సిబ్బంది, అధికారులతో సంఘాభివృద్ధి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏ కార్యక్రమం విజయవంతం కావాలన్నా దానికి అధికారుల కృషి ఎంతో అవసరమన్నారు. సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే ఆయా విభాగాల అధికారులు వారి భాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే ఆయా శాఖలు అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


యండగండి సహకారం బ్యాంక్ వద్ద పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా సహకార అధికారి

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

భీమవరం: అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని బుధవారం మార్కెట్ సచివాలయం వద్ద సీపీఐ అధ్వర్యంలో బందరుపుంత, నెహ్రూ కాలనీ వాసులు ఆందోళన నిర్వహించి దరఖాస్తులను సచివాలయం కార్యదర్శి సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేదలకు చాలీ, చాలని స్థలాలిచ్చి కాలనీలను మురికివాడలు చేయవద్దన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో పేదల తరపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏలేటి ఆనంద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం లక్ష్మీపతి, పార్వతి, దేవి, అప్పాయమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలోని సచివాలయ కార్యదర్శికి దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 26న మహాధర్నా

భీమవరం: ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తూ ఈ నెల 26వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలు మహాధర్నాను విజయవంతం చేయాలని సోమవారం భీమవరం సీఐటీయు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశంలో పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను, కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. ఢిల్లీలో పెద్ద ఎత్తున 13 నెలల పాటు జరిగిన ఉద్యమంలో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నల్లచట్లాలను వెనక్కి తీసుకుంటామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, లేబర్ కోడ్లు రద్దు చేస్తామని తదితర డిమాండ్స్ అంగీకరించి వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక పథకాలను ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం కోసం ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. ఎటువంటి భారాలు వేయమని కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చి భారాలు వేయడం మొదలుపెట్టారని విమర్శించారు. ఈసందర్భంగా మహాధర్నా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిలారి తవిటి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, చెల్లబోయిన రంగారావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వైవి ఆనంద్, మామిడిశెట్టి లక్ష్మీపతి పాల్గొన్నారు.


సమావేశంలో మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆకివీడు: గ్రంథాలయాలను విద్యార్థులు, పౌరులు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు పిలుపునిచ్చారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో బహుమతులను అందజేశారు. మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏకేపీఎస్ జూనియర్ కాలేజీ గ్రంథ పాలకులు పెద్దిరాజు మాట్లాడుతూ గ్రంథాలయం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సుజాత, రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కాళ్ల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) కోపల్లె, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినఅమిరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఉండి: ఉన్నత లక్ష్యంతో చదివితేనే అనుకున్న గమ్యం చేరుకోగలమని యండగండి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. సోమవారం యండగండి, ఉండి శాఖా గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యండగండిలో చిత్రలేఖనం, క్విజ్‌పోటీలు, ఉండిలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యండగండిలో మాట్లాడుతూ చిన్ననాటి నుండే చదువుపై మక్కువ పెంచుకుంటే భవిష్యత్‌లో గొప్పవారవుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు ఎన్‌సీహెచ్ రామకృష్ణ, జేవీ కృష్ణమూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలోని శాఖా గ్రంథాలయంలో డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరంలో

భీమవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్‌పోటీ, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ లక్ష్మి, జి శ్యామ్, కె చెలియకుమారి పాల్గొన్నారు.

ఆద్యంతం ఆధ్యాత్మికం.. కార్తీకమాసం

ఉండి: కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని శివాలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. ఉండి, చెరుకువాడ, మహదేవపట్నం, కోలమూరు, ఉప్పులూరు, యండగండి, తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చారు.ఈ సందర్భంగా ఉండి రాజులపేటలో వేంచేసియున్న పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 3 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఆలయ క్షేత్రపాలకుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, విశేషార్చనలు, నీరాజనం, మంత్ర పుష్పాలు అందజేశారు. సాయంత్రం 6:30 గంటల నుంచి ఆకాశ దీపోత్సవం అనంతరం సహస్ర దీపాలంకరణ, జ్యోతిర్లింగార్చన, విశేష అలంకరణ అర్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

స్వామి వారికి అభిషేకాలు

కాళ్ల: కార్తీకమాసం సోమవారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. కాళ్ల, కాళ్లకూరు, సీసలి, కలవపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, బొండాడ, కోపల్లె, తదితర గ్రామాల్లో శివాలయాలకు తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.


ఉండి: విశేషాలంకరణలో చెన్నమల్లేశ్వరుడు


కాళ్ల: స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

దీప కాంతుల్లో శైవక్షేత్రాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. ఉమా సోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రజుమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.


భీమవరం(ప్రకాశం చౌక్): దర్శనానికి వేచి ఉన్న భక్తులు

భీమేశ్వస్వామి ఆలయంలో...

పట్టణంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణధికారి శ్రీనివాస్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.